# అద్దంలో నువ్వా నేనా!

అప్పుడే క్లాస్ అయిపోయింది.

'మేడమ్ పిలుస్తున్నారు' అంటూ వచ్చేడు జవాను.

బయటికి రాగానే ఎదురయింది, సుజాత.

'కంట్రోలర్ దగ్గరకేనా?' అడిగింది. అవుననన్నట్లు తల వూపేను. 'శ్రీ హరీ' అంటూ కిసుక్కున నవ్వి ముందుకు సాగి పోయింది సుజాత.

ప్రిన్సిపాల్ పిలిచిందంటే ఏదో రాళ్ళవర్షం కురవబోతోందనేది మా అందరికీ తెలిసిన విషయమే. సుజాత ఊతపదంగా అనే 'శ్రీహరీ' కి 'హతవిధీ' అని అర్థం.

నవ్వుకుంటూ కదిలేను.

—'కంగ్రాట్స్ రజనీ.' అంటూ ఆహ్వానించిన ప్రిన్సిపాల్ కేసి తెల్లమొహం వేసి చూస్తూ — ఆమె కెదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాను.

'నళిని చెప్పింది — పత్రికలో నీ కథ పడిందని. తెప్పించి చదివేను. కథ చాలా బాగుంది'.

'థాంక్స్ మేడమ్.' నాకు గుటక పడింది.

'రజనీ — మన స్టాఫ్ అందర్లోనూ నువ్వంటే నాకు ఎంతో

వాత్సల్యం. అతిశయోక్తి అనుకోకపోతే, నువ్ మా పెద్దమ్మాయివే అనిపిస్తూ వుంటుంది నాకు.'

ముందు కథ అర్థమైంది నాకు. సుజాత నవ్వు గుర్తుకొచ్చింది.

'నీ తెలివి తేటల మీద నాకు చాలా గౌరవం, నమ్మకం కూడా రజనీ. మన సంస్థకూ, ప్రత్యేకించి నాకూ – నువ్వే క్రెడిట్ తేవాలి. రియల్లీ — నేన్నిన్ను చూసి గర్వపడుతున్నాను.'

బెల్ కొట్టి జవానుని పిలిచింది. రెండు కాఫీలు తెమ్మంది. నేను తలవంచుకుని కూర్చున్నాను. కుడికాలి బొటనవ్రేలు అప్పటికే నేలమీద చాలా అక్షరాల్ని దిద్దుకుంది.

'అవునూ, కథని అలా సందిగ్ధంలో ముగించావ్. ఆ సమస్యకి నువ్ చూపే పరిష్కారం ఏమిటి?'

'కథ చివర్లో సూచనగా చెప్పటం జరిగింది మేడమ్. పరిష్కారం ఇదే అని బల్ల గుద్దినట్లు చెప్పకుండా, ఇది అయితే బాగుంటుంది అని సూచించటంవలన కథకూ ముగింపుకీ బలం వస్తుంది.'

'ఆల్ రైట్.. ఆల్ రైట్' అంటూ ఫైల్స్‌ని సర్దింది.

కాఫీలు వచ్చినై. 'తీసుకో' అంది.

ఇద్దరం కాఫీ సిప్ చేస్తున్నాం.

'చూడు రజనీ – ఇలాంటి కథలు రాసి అమోఘమైన నీ ప్రతిభని వేస్ట్ చెయ్యకు.'

నాకు పొలమారింది. కాఫీకప్పుని పక్కన వుంచి, రుమాలుతో చీరమీద వొలికిన కాఫీని తుడుచుకున్నాను.

'నీకు ఇదివరలోనూ ఓ సారి చెప్పాను. నీ రచనాశక్తీ, తెలివి తేటలూ, ప్రతిభా, ఉత్పత్తీ – సమస్తం – ఆ మహాదేవి శ్రీ

లలితా. శివజ్యోతి – అనుగ్రహం. అవునా ?'

కామేశ్వరిగారి కళ్ళు చాలా తీక్షణంగా వెలిగిపోతున్నై. కళ్ళ అద్దాల్లోంచీ చూపుల్లోని వేడి సూటిగా నన్ను తాకుతోంది.

'అవును' పీలగా సమాధానం చెప్పేను.

'కనుక — వాటితో ఆ మహాదేవి మహత్తుని నీ సాటివారికీ, నీ తోటివారికీ, నీ సమాజానికీ తెలియజేసి వాటిని సార్థకం చేసుకో. అంతేగానీ, ఈ లాకాయ్ లూకాయ్ కథలు రాసి నువ్వేదో సంఘాన్ని ఉద్ధరిస్తున్నానని మోసపోకు.'

కామేశ్వరి గారిలో ఆవేశం గోదావరిలా పరవళ్ళు తొక్కుతోంది. నేను వెలచూపులు చూస్తున్నాను.

'ఏమిటి నువ్వా కథలో రాసింది — మూఢ విశ్వాసాలతో జనమంతా అంధకారంలో కూరుకుపోతున్నారనేగా. ఏది మూఢవిశ్వాసమో నీకు తెలుసా. పాశ్చాత్యదేశాల ప్రజల్నిచూడు. ఇలాంటి రాతలే రాసి రాసి, ఇవాళ వెంకటేశ్వర స్వామి దేవాలయాలూ, హరే రామ హరే కృష్ణ భజనలూ కావాలంటున్నారు. వాళ్ళందరికీ నీ మాత్రం తెలివి తేటలు లేవా, లేవా అని అడుగుతున్నాను.', గద్దించింది.

కుర్చీలోంచీ లేచి నిలబడి పచార్లుచేస్తూ చెప్పసాగింది, 'నువ్వు నా పెద్ద కూతురు లాంటిదానివి. అందుకనే ఇంతగా చెప్తున్నాను. నీ ఇంటెలిజెన్సంతా ఆ మహాదేవి శ్రీ లలితా శివజ్యోతికి అంకితం చెయ్యి. ఆ తల్లి సర్వప్రపంచానికీ మూలం, మూలాధారం. ఆమె కరుణ వల్లనే నేనింతదాన్నయ్యాను. నువ్వూ గొప్పదానివి కావాలని నా ఆశ, ఆశయం.'

'ఆరాటం' అనుకున్నాను మనస్సులో. నవ్వు రాబోయింది. గుండె గొంతుకలో ఆపేను.

'స్టూడెంట్స్‌కి రోజూ ప్రతి క్లాసులోనూ కనీసం పావుగంటసేపు శ్రీ లలితా శివజ్యోతి గురించి చెప్తానని నాకు మాటిచ్చావ్ – ఆగస్ట్ మొదటివారంలో. ఇప్పుడు డిశంబర్ జరుగుతోంది. నేను విచారిస్తూనే వున్నాను. ఒక్కసారన్నా నువ్ ఈ అంశాన్ని గురించి వాళ్లకి చెప్పలేదు.' "గ్రాస్ డిస్‌రెస్పెక్ట్; అట్టర్ డెరిలిక్షన్ ఆఫ్ డ్యూటీ." వత్తి పలికి, చురుగ్గా చూసింది.

నా నుంచీ కనీసం 'సారీ' అనే మాటైనా వస్తుందేమోనని ఓ క్షణం ఆగింది.

నేను మౌనంగానే వున్నాను.

క్షణాల తర్వాత తనే అన్నది, "రాత్రి ఆ మహాదేవి నాకు కలలో ప్రత్యక్షమై – ఈ ప్రపంచంలోని బాధావ్యథలకు తరుణోపాయం తన ఆరాధనే అని మరోసారి నొక్కి వక్కాణించింది.'

'నీ పిచ్చి' అనుకుంది నా మనస్సు.

'కనుక నువ్ నే చెప్పిన మాట విను. కొత్తగా సర్వీసులో చేరినదానివి; అందులోనూ నీ పోస్ట్ తాత్కాలికమైంది. నెక్స్ట యియర్ నువ్ కంటిన్యూ అయ్యే బాధ్యతని నేను తీసుకుంటాను. నువ్ మాత్రం నీ రచనా శక్తితోనూ, తెలివి తేటలతోనూ ఆ మహాతల్లిని గురించి ప్రచారం చెయ్యాలి – తెలిసిందా.'

'విషయం ఎప్పుడో తెలిసిందండి. ఆచరణ గురించే ఆలోచిస్తున్నాను.' నసిగేను.

'ఆలోచనకి అవకాశమేలేదు. ఆ తల్లి మహత్యాన్ని ఈ తల్లిలో చూడు. ఆచరణలో నీకు అంతా విజయమే.'

ఏ జవాబూ చెప్పకుండా బయటపడ్డాను. అప్పటి వరకూ అణచి పెట్టిన నవ్వు ఒక్కసారిగా పెల్లుబికింది. గొల్లున నవ్వు

కున్నాను.

'యమ్మెస్సీ,ఎమ్మీడీ, పిహెచ్‌డీ — డాక్టర్ కామేశ్వరి. ఎందుకీ డిగ్రీలు? శ్రీ లలితా శివజ్యోతి గురించి బియిడీ క్లాసులో విద్యార్థినులకి బోధిస్తే — విని తలలూపే గొఱ్ఱెల మంద అనుకుంటోంది వాళ్ళని. తన పిచ్చి తన కానందం. అంత వరకూ బాగానే వుంది. కానీ, ఆ పిచ్చిని అందరూ ప్రచారం చేయాలని ఆరాటపడటం ఏమిటి?

'ఈ దేశానికి విముక్తి లేదు' అనే సావిత్రి మాటలు గుర్తొచ్చినై నాకు.

స్టాఫ్ రూమ్‌లోకి వెళ్ళగానే విషయం ఏమిటని అడిగింది సుజాత.

చెప్పాను. సావిత్రి, సుజాత, నళిని అంతా గొల్లున నవ్వేరు.

'పూర్ లేడీ. మా దగ్గర తన పప్పులుడకవు. నువ్వేమో టెంపరరీ లెక్చరర్‌వి. అందుకని నిన్ను వాడుకోవాలని చూస్తోంది' సావిత్రి అన్నది.

'బ్లాక్ మెయిల్' అంది సుజాత.

'సామదాన భేదాలన్నీ ప్రయోగిస్తోందన్నమాట' — నళిని.

'జ్వాలై నాటికి నీ ప్రయత్నంలో నువ్వుండటం చాలా అవసరం రజనీ. ఈ కంట్రోలర్ వాలకం చూస్తుంటే నువ్ కంటిన్యూ అయ్యే అవకాశం కనిపించడంలేదు' సావిత్రి సందేహంతో కూడిన సలహా యిచ్చింది.

'లేదా తెల్లజెండా చూపి, జై జగజ్జననీ అని ఆమె పాద ధూళి నీ శిరంబున దాల్చి కొలుచుట శుభప్రదము, జయప్రదము, ముక్తిప్రదము' — నాటక ఫక్కీలో అంది నళిని.

'శ్రీ హరీ!' అని దీర్ఘం తీసింది సుజాత.

'కమిటీ మెంబర్లకీ, సెక్రటరీకి చెప్పేస్తే....' సాలోచనగా

అన్నాను.

'ఆ పిచ్చి ఆలోచనలు చేయకు. వాళ్ల జుట్టు ఈవిడ చేతిలో వుంది. ఈవిడ సర్వీసు ఇరవైపేళ్లు ఇక్కడ. వాళ్లంతా ఏనాడో ఇళ్లల్లో పూజామందిరాలు పెట్టుకున్నవాళ్లే.'

బెల్ వినపడింది. అందరమూ క్లాస్ రూమ్స్‌కేసి నడిచేము.

*　　*　　*

మా వూళ్లో రచయిత్రుల మహాసభ జరిగింది. ఆ సభలో నేనూ కవితా పఠన కార్యక్రమంలో పాల్గొన్నాను.

మా ప్రిన్సిపాల్ కామేశ్వరిగారు ఆ కార్యక్రమానికి విచ్చేశారు.

నా కవిత అంతా మూఢ నమ్మకాల మీద ఖండనలతో సాగింది. దేవుడిపేరుతో వ్యాపింపచేసే అంధ విశ్వాసాల వల్లనే మనిషి తిరోగమనవాది అవుతున్నాడనేది స్థూలంగా నా కవితాంశం.

ఎక్కడో స్విచ్‌వేస్తే మైలు దూరం అవల కూడా వెలిగే వీధి దీపంలా నా కవితలోని వస్తువు కామేశ్వరి గారి మెదడులో ఎన్నో ఆలోచనల్ని పురిగొల్పింది.

నేను సబ్బు నురుగులా తన చెయ్యి జారిపోతున్నానని ఆవిడకి అవగతమైంది.

మర్నాడు —

తన ఛాంబర్ కి పిలిపించింది.

వంటనూనె ధరలా కామేశ్వరిగారి పట్ల నా భయం రోజు రోజుకూ పెరిగిపోతోంది. మరో ఉపన్యాసాన్ని వినటానికి సిద్ధపడే లోపలికి వెళ్లాను.

'నీ కవిత చాలా బాగుంది' అంది ముందుగా.

నాకు తెలుసు. ఉపన్యాసం ఇలాగే మొదలౌతుంది. అందుకే

థాంక్స్ చెప్పలేదు ఈ సారి.

'నీ కంఠస్వరం చక్కగా వుంది. వాక్కులో ధాటి, స్పష్టత నిజంగా బాగున్నై.'

వింటూ కూర్చున్నాను.

'మల్లెపూలు కోసి, ఇంపక్కా మాలకట్టి ఏ దేవినీ అలంకరించకుండా, నువ్వూ పెట్టుకోకుండా మంటల్లోకి విసిరేస్తున్నావ్ రజనీ — నువ్వు.'

నేను ఆమెకేసి చూసేను.

'అవును. వ్రాసే శక్తీ, చెప్పే నేర్పూ వున్నై నీకు. వచ్చిన చిక్కంతా వస్తువుతోనే. వెండి కంచంలో వేడి వేడి పాల అన్నం తింటే వుండే శోభ, సంతృప్తీ — ఎంగిలి మెతుకులు వేసుకు తింటే వుండవు రజనీ. నా మాట విను....'

ఆవిడ వాడిన పోలికకి గతుక్కుమన్నాను. ఆమె పిచ్చి తారాస్థాయి నందుకుంటోందనేది - స్పష్టమైంది నాకు. ఎవరి నమ్మకాలు వారివి అని వూరుకోగల సహృదయత, సంస్కారం నాకున్నాయి కానీ, ఆమె.... ఆమె.... ఆమె తన నమ్మకాల్ని నా చేత నమ్మించాలని ప్రయత్నించడమే కాక, వాటి ప్రచారానికి నన్ను వాడుకోవాలని చూస్తోంది.

నాకు చిరాకేసింది. కడుపు రగిలి పోతోంది.

ఆమె ఇంకేం చెప్తుందోనన్న స్ఫురణని వదిలేసి విసురుగా బయటికి వచ్చేశాను.

'తల్లీ శ్రీ లలితా ....' అని ఆమె నిట్టూర్చడం గడప దాటుతుండగా నా చెవి సోకింది.

* * *

కామేశ్వరిగారు తన మూడోకూతురి పెళ్లి నిశ్చయం చేసుకున్నారు. ఓ రోజున ఆమె భర్తని తీసుకుని మాయింటికి వచ్చింది.

'నువ్ మా పెద్దమ్మాయివి. రేపట్నుంచీ నువ్ మా యింటికి రావాలి. పెళ్లి నీ చేతులమీదుగా జరగాలి. నాకు అటూ ఇటూ ఎవరూ దగ్గర బంధువులు లేరు. నువ్ నిలబడి అన్ని పనులూ సవ్యంగా జరిగేట్లు సహాయం చేయాలి' అంది చేతులు పట్టుకుని.

నేను చాలా బిడియ పడ్డాను. సరేనని మాటయిచ్చి పంపేను.

— పెళ్లి నిర్విఘ్నంగా జరిగింది. నా సహాయ సహకారాలకి కామేశ్వరిగారు నన్ను ఎంతగానో పొగిడేరు, కృతజ్ఞతలు చెప్పేరు.

అంతా అయిన తర్వాత — నాకు చాలా ఖరీదైన చీరె జాకెట్ పెట్టి పంపేరు; నేను ఎంత వద్దంటున్నా వినకుండా.

నేను వో విధమైన మొహమాటంలో పడ్డాననిపించింది నాకు.

ఆ మర్నాడు —

కామేశ్వరి గారు మళ్లీ మాయింటికొచ్చేరు.

చాలా సేపు — —సంభాషణ — పెళ్లి గురించీ, మా కాలేజీ విషయాల గురించీ సాగింది.

క్షణాల తర్వాత ఆమె చెప్పింది.

'రజనీ నీ యిబ్బందిని నేను అర్థం చేసుకున్నాను. మహాదేవి శ్రీ లలితా శివజ్యోతి గురించి నీకు నీవుగా స్టూడెంట్స్‌కి గానీ యితరులకి గానీ చెప్పటానికి కొంత డెలికసీ ఫీలవుతున్నావు. నిజమే, ఇలాంటి విషయాలు క్లాస్ రూమ్‌లో చెప్తే పిల్లలు 'రెజిస్ట్' చేయవచ్చు. అందుకని నాకో మంచి ఆలోచన వచ్చింది.'

నా కళ్లల్లోకి చూస్తూ ఆగింది.

నేను వింటూ కూర్చున్నాను.

'మావారికి జ్యోతిశ్శాస్త్రంలో మంచి ప్రవేశం వుందని నీకు తెలుసు కదూ. నీకనే ఏంటిటి? మన కాలేజీలో చాలామందికి తెలుసు. ఆ మాటకొస్తే ఈ చుట్టుప్రక్కల రెండు మూడు జిల్లాల్లోనే వారికి మంచి పేరుంది....'

అయితే ఏమిటన్నట్టు నేను సాలోచనగా కుర్చీలో ముందుకు జరిగేను.

'ఓ గ్లాసు మంచినీళ్లివ్వు' అడిగింది.

మంచినీళ్లు త్రాగి మళ్లీ చెప్పటం మొదలెట్టింది. 'మన స్టూడెంట్స్‌లోనూ, నీ పరిచయస్థుల్లోనూ ఈ సంగతిని బాగా 'ప్రాపగేట్' చెయ్యాలి నువ్వు. వాళ్ళకి తమ భవిష్యత్తుని గురించి తెలుసుకోవాలనే ఉత్సుకతని కలిగించాలి. అది చాలా అవసరమైన అంశంగా వాళ్ళు భావించే విధంగా నువ్ దృఢంగా చెప్పాలి. వాళ్ళని నా దగ్గరికి పంపితే చాలు. మిగిలిన సంగతి నేను చూసుకుంటాను. నేనూ మావారూ ఆలోచించిన మీదట ఈ నిశ్చయాని కొచ్చాం. ఇలాంటి నమ్మకాల్ని ప్రచారం చేయాలంటే ఏదో ఒక శాస్త్రాన్ని ఆధారం చేసుకోవడం చాలా అవసరం. జాతకంలో ఫలానా దోషం వుందనీ దాన్ని పరిహరించుకోవడానికి శ్రీ లలితా శివజ్యోతి ఆరాధన, భక్తి శరణ్యం అంటే తప్పకుండా విశ్వాసం కుదురుతుంది ఏమంటావ్?'

నేనేమంటాను? అంతా కలగా వుంది నాకు. ఆమె అసలు దేన్నిగురించి ఆరాట పడుతున్నదో, ఆ ఆరాటం ఎందుకో ఏమిటో నాకు అర్థంకావడంలేదు.

కామేశ్వరిగారి మానసికస్థితిగురించి నాకు సందేహంరాసాగింది.

'నువ్ మాకు అండగా నిలబడతావనీ, ఈ సహాయం చేస్తావనీ నాకు నమ్మకముంది. నువ్ మా పెద్దమ్మాయితో సమానం' అంటూ

తేచింది ఆవిడ.

ఈ సారి నాకీ పెద్దమ్మాయి మాట పలకమీద మేకుతో గీసినట్లు అనిపించింది.

అలాగేలెమ్మని నాచేత తలవూపించుకొని వెళ్లిపోయింది కామేశ్వరి గారు.

'ఇదెక్కడి కర్మరా బాబూ' అనుకుంటూ తలపట్టుకున్నాన్నేను.

* * *

సుజాత, నేను, నా క్లాస్‌లో వో విద్యార్థిని – రమ – కలిసి కామేశ్వరిగారి ఇంటికి వెళ్లాం.

రమ తన జాతకం తెచ్చిందనీ, తన భవిష్యత్తు గురించి తెలుసుకోవాలనుకుంటున్నదనీ చెప్పాం.

కామేశ్వరిగారి కళ్లల్లో పారిజాతాలూ, పెదవులమీద నందివర్ధనాలూ విరగకాసేయి.

ఎంతో సాదరంగా కూర్చోబెట్టి కాఫీ ఫలహారాలు యిచ్చారు. ఆమె భర్త ఆ కాగితాన్ని తీసుకుని మీనమేషాలు లెక్కించసాగేడు.

'దీనిమీద పుట్టిన తేదీ సమయం వగైరా లేవేం' అన్నాడాయన.

'అవన్నీ చిరిగిపోయాయిటండీ. చక్రం వుందికదా. ముఖ్యమైన నక్షత్రాలూ అవీవున్నై కదా అని తెచ్చాం' సుజాత చెప్పింది.

'ఫర్వాలేదులెండి.' అని ఓ పావుగంట తర్వాత చెప్పసాగేడు.

'అద్భుతమైన జాతకం ఇది. ఈమె భర్తకు రాజయోగం వుంది. సర్వసౌభాగ్యాలూ అనుభవించాల్సిన యోగజాతకురాలు ఈమె. ఈమెకు ఒకే ఒక్క మగ బిడ్డ, ఇద్దరు కుమార్తెలు కలుగుతారు.' అని ఓ క్షణం ఆగి రమకేసి అదోలా చూసేడు.

ఏమిటన్నట్టు నాకేసి చూసింది సుజాత.

తెలీదన్నట్టు పెదవి విరిచాను నేను.

రమ మాయిద్దరి మొహాలూ చూడసాగింది.

'చూడమ్మా రమా; నీ జాతకంలో ఒక్కింత దోషం వుంది. దాని పరిహారంకోసం నువ్ రోజూ శ్రీ లలితా శివజ్యోతి పూజని చేసుకోవాలి. ఇలా కనీసం ఆర్నెల్లన్నా చెయ్యాలి. ఆ మహాదేవి సృష్టికి మూలం. ఆ తల్లి కటాక్షం నీకు శ్రీరామరక్షగా వుంటుంది. ఆమె రూపుని మీ మేడమ్ దగ్గర్నుంచీ తీసుకో.' అంటూ ముగించారు ఆయన.

మేడమ్ కామేశ్వరి గారు శ్రీ లలితా శివజ్యోతి రూపుని రమకు ఇచ్చారు. 'మహాప్రసాదం' అంటూ రమ తరఫున దాన్ని తాను అందుకుంది సుజాత.

కామేశ్వరిగారు చిన్న ఉపన్యాసం యిచ్చి ముగించారు.

వాళ్ల దగ్గర శలవు తీసుకుని వచ్చేశాం మేము.

నాలుగు రోజుల తర్వాత రమ నుంచీ రూపు ఖరీదు క్రింద నలభై రూపాయలు వసూలు చేశారు — కామేశ్వరిగారు.

* * *

వేసవి శలవులు జరుగుతున్నై.

ఆరోజు —

తన కొచ్చిన ఉత్తరాల్ని వొకదాని వెంట వొకటిగా చదువుకుంటోంది మేడమ్ కామేశ్వరి.

కవర్ తెరిచి ఉత్తరాన్ని చదువుకోసాగింది.

'నమస్తే మేడమ్;

శ్రీ లలితా శివజ్యోతి కరుణా కటాక్ష వీక్షణాలు తమపై ఇతోధికంగా ప్రసరించాలని కోరుతూ వ్రాసే విశేషాలు

రమ మీరిచ్చిన మహాదేవి రూపుని చాలా శ్రద్ధగా భక్తి ప్రపత్తు

లతో పూజించుకుంటోంది అని వ్రాసి మీకు మరింత మిథ్యా సంతృప్తిని కలిగించలేను. ఆరోజు — రమకు మీ వారు జాతకఫలం చెప్పిన రోజు గుర్తుంది కదూ ?

ఆ జాతకం రమది కాదు. వాళ్ల అమ్మది. ఆమెకు రమ వొక్కతే వొక్క సంతానం. ఆమె పోయి ఆరేళ్లయ్యింది.

అన్నట్టు, రమ తండ్రి వంటలు చేసుకుంటూ కాలం వెళ్లబుచ్చాడు. ఆయన పోయి ఇరవైవె ఏళ్లయింది !

పెద్ద పెద్ద చదువులూ, జీవితాన్ని అనుభవించి ఆనందించటానికి అంతో యింతో నిలకడ గల ఆదాయమూ – వున్న మీలాంటి వాళ్లు ఏం సాధించాలని ఇలాంటివనులకుపూనుకుంటారో నాకు అర్థంకావడంలేదు.

ప్రతి ఏడాదీ మీకు నాలాంటి నిస్సహాయులు తటస్థపడతారు — నాకు తెలుసు. ప్రతిఏడాదీ, మీ దయాధర్మాల మీద ఆధారపడే విద్యార్థినులూ తటస్థపడతారు. వాళ్లందర్నీ మీ నమ్మకాలకు గురిచేసి, వాటిని వాళ్లమీద రుద్ది మీరే ఆనందాన్ని పొందగలరో – నింపాదిగా ఆలోచించండి. మన అభిప్రాయాల్ని ప్రచారం చేయాలనుకునే ముందు ఎదుటి వారి అభిప్రాయాన్ని మన్నించే సంస్కారం అలవరచుకోగలగాలి మనం. అంతేగాదు, మీ అభిప్రాయాన్ని మీరు ప్రచారం చేసుకోండిగానీ, దానికోసం అమాయకుల్ని భజనపరులుగా మార్చే తత్వం మార్చుకోండి. నాది ఒకే ఒక విన్నపం, మనవి, కోరిక — 'లెటజ్ నాట్ రిమెయిన్ యాజ్ ఫూల్స్ ఫరెవర్!' "

కామేశ్వరిగారికి గొంతు పొడారిపోయింది. మొహమంతా చెమట పట్టింది. లెటర్ వ్రాసిందెవరో అర్థమౌతూనేవుంది.

కామేశ్వరిగారి బ్లాక్ మెయిలింగ్‌కి అందనంత దూరంలో ప్రయాణం చేస్తోంది, రజని !!